
# రోగానికి మందు

-నామని సుజనాదేవి



మళ్లీ గుండెల్లో కలుక్కుమంది. చిన్నచిన్నగా మొదలైన నొప్పి కొంచెం కొంచెంగా ఎక్కువవుతోందని అనిపించింది. భయమేసింది. దాదాపుగా వారంరోజులుగా అప్పుడప్పుడు సన్నగా గుండెల్లో నొప్పి వస్తుంది. పండగకి ఆడపడుచులు రావడం, అందరికీ వంటావార్పూ చేయడం వల్ల పనిమనిషి రాక పనెక్కువవడం వల్లనేమో అనుకుని అంతగా పట్టించుకోలేదు సుధ.

కానీ మొన్న ఆడపడుచు రాధ తోటికోడలికి ఇలాగే నొప్పి వస్తే నిర్లక్ష్యం చేసిందని, ఒకసారి బాగా నొప్పి రావడంతో హాస్పిటల్‌కి తీసుకెళితే నిర్లక్ష్యం చేసేసరికి ఇక చివరిస్టేజీకొచ్చిందని చేయి దాటిపోయిందని మహా అయితే ఒకట్రెండేళ్ళు బ్రతుకుతుందన్నారట. ఇలా రాధ మాటలు గుర్తుకురావడంతో భయం వేసి వెంటనే భర్తతో చెప్పింది తనకొచ్చిన నొప్పి సంగతి.

ఆంధ్రానుంచి ఈమధ్యకాలంలోనే ఈ తెలంగాణా ప్రాంతానికి భర్త ఉద్యోగరీత్యా ట్రాన్స్‌ఫర్ కావడం వల్ల ఇక్కడ హాస్పిటల్స్ సంగతి అంతగా తెలియదు ఇద్దరికీ. అందులో వీరుంటున్న ఇల్లు వాటాలుగా కాక ఒక్కటే విడిగా ఉండడం వల్ల చుట్టుప్రక్కల వారితో అంతగా పరిచయం కాలేదు.

వర్కింగ్‌డే రోజు భర్త రాజారావుకు తీరకపోవడం వల్ల ఆదివారం రోజు హాస్పిటల్‌కు వెళదామని బయలుదేరారు.

బయలుదేరడమైతే బయలుదేరారు కానీ ఏ డాక్టర్ దగ్గరకు అన్నది అర్థంకాలేదు. మంచి ఫిజీషియన్ దగ్గరకు వెళదామనుకున్నారు ముందు. ఆ తర్వాత ఛాతీలో నొప్పి అంటే ఛాతీని పరీక్ష చేయాలని ఏమైనా అంటారేమో అలా అయితే ఆడ డాక్టరైతే మంచిదనుకుని చూసుకుంటూ బయట లేడీ డాక్టర్ బోర్డ్ ఉన్న క్లినిక్‌కి వెళ్లారు. ఎంక్వైయిరీలో ఫీజు తీసుకుని పేరు రాసుకుని నెంబర్ ఇచ్చి కూర్చోబెట్టారు.

ఆ హాల్‌లో చాలామంది ఆడవాళ్ళు పరీక్ష చేయించుకోవడానికి కూర్చుని ఉన్నారు. దాదాపు గంట తర్వాత తన పేరు పిలిచారు. కర్టెన్ తీసుకుని లోపలికెళ్లింది సుధ.

అక్కడక్కడ తెల్ల వెంట్రుకలతో మెడలో స్టెతస్కోప్‌తో ఉన్న ఒకావిడ తనముందు ఉన్న పేషెంట్ ఏదో చెబుతుంటే వినిపించుకుంటుందో లేదో తెలియని స్టేజీలో తలవంచుకుని ఏదేదో రాసేస్తూ ఉంది. సుధ లోపలికి వెళ్లిన అలికిడి వినగానే "లోపల బల్లపైన పడుకోమ్మా" అంది అక్కడ ఓ పక్కనున్న సిస్టర్.

'ఇదేమిటి తనువెళ్ళి అసలు తన బాధ ఏమిటి? తన కష్టం ఏమిటో ఏమీ చెప్పనేలేదు. అప్పుడే ఆవిడ లోపలికెళ్లి పడుకోమంటోందేమిటి?' అనుకుంటూ సుధ ఆలోచనల్లో ఉండగానే..

"నిన్నే..లోపల పడుకోమ్మా" అంది ఈసారి డాక్టర్ 'చెబితే వినిపించడం లేదా' అన్న భావం, టైంవేస్ట్ అవుతోందన్న అసహనం కలగలిపి ధ్వనించాయా కంఠంలో.

ఏకవచన ప్రయోగానికి మాట్లాడిన విధానానికి మనస్సు చివుక్కుమనిపించినా చప్పుడు చేయకుండా వెళ్లి లోపల బల్లపై పడుకుంది సుధ.

ప్రిస్కిప్షన్ రాసి ఎదుటి పేషెంట్‌కిచ్చేసి సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ సుధ దగ్గరికొచ్చింది డాక్టర్. మాట్లాడ్డం అయిపోగానే స్టెతస్కోప్‌తో పరీక్షిస్తూ-

"ఊపిరి బాగా తీయి" అంది. తీసింది సుధ.

"ఆకలిగా ఉంటోందా?" అంది. తలూపింది సుధ.

"నాలుక చాపు, కళ్ళు తెరువు, కాళ్ళు వాపులొస్తున్నాయా?" వంటి ప్రశ్నలు వేసి సమాధానానికి అంత ప్రాముఖ్యం ఇవ్వకుండా యాంత్రికంగా పరీక్షిస్తూ మధ్యలో సెల్‌లో రెండుఫోన్లు అటెండ్ అయి "ఎన్నో నెల?" అంది చివరగా.

"నేను ప్రెగ్నెంట్‌ను కాను...." అంది సుధ ఒకింత దురుసుగా.

"ఏమిటి..?" అందావిడ ఆశ్చర్యంగా.

"అవును. అసలు పేషెంట్లు అంటే ఏమనుకుంటున్నారు. రాగానే బల్ల ఎక్కు అన్నారు. కనీసం ఎందుకోసం వచ్చాను, నా బాధ ఏమిటి అనేది అడిగారా. పేషెంట్లు ఎవరైనా బాధతో ముందు తమ కష్టాలన్నీ చెప్పుకుందామని వస్తారు. కనీసం ఐదు నిముషాలు కేటాయించి ఓపికగా విని, నవ్వుతూ నాలుగు స్వాంతన మాటలు చెబితే ఆ మాటల ద్వారా అందించిన ధైర్యానికి సగం రోగం తగ్గుతుంది. అంతేకానీ యాంత్రికంగా టైం అయిపోతుందనుకుంటూ వచ్చిన వాళ్లనేమీ చెప్పనివ్వకుండా ఆడవాళ్లయితే చాలు బల్ల ఎక్కిస్తే ఏమైనా అర్థం ఉందా?" నాలో అంతవరకూ లోన సుళ్ళు తిరుగుతున్న ఆవేశం, ఆవేదనగా బయటకు వచ్చింది.

"మీకు చెప్పేంతగా చదువుకోకపోవచ్చు. అంత వయసూ లేకపోవచ్చు. కానీ అందరు పేషెంట్లు మనసులో అనుకుంటున్నది నేను బయటకు అన్నాను. బాధపెడితే క్షమించండి" అంటూ ఇంక అక్కడ నిలబడలేక బయటకొచ్చేసింది సుధ.

కనీసం తర్వాతైనా డాక్టర్, పేషెంట్లతో అనుబంధం పెంచుకునే విధంగా అడుగువేస్తుందని నాకు తెలుసు. అక్కడి ట్రీట్‌మెంట్‌కు భయపడో ఏమో గానీ నొప్పి మళ్ళీ రాలేదు.

★